

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# గురుదేవోభవ

నీరజ నెమ్మదిగా స్ప్రింగ్ డోర్ తెరుచుకుని ప్రొఫెసర్ మార్కండేయులు రూమ్‌లోకి వెళ్ళింది. ఆయన దీర్ఘంగా గ్రంథ పఠనంలో మునిగిపోయి ఉన్నారు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ ఆయన దగ్గరకు వెళ్ళింది.

ఎవరో వచ్చిన అలికిడి విని తలెత్తి చూసి నవ్వుతూ "రామ్మా రా... కూర్చో" అన్నాడు మార్కండేయులు పుస్తకం మూసేస్తూ.

"సర్, మీ దయవల్ల నాకు పి.హెచ్.డి. చేసే అవకాశం లభించింది. మీరు నాకు గైడ్‌గా కూడా ఉండటానికి అంగీకరించటం నా అదృష్టంగా భావిస్తున్నాను. మీకు కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో తెలియటం లేదు" అంది నీరజ ఆయనపట్ల గల గౌరవభావంతో కుంచించుకుపోతూ.

"కృతజ్ఞతలు చెప్పవల్సింది ఇప్పుడు కాదు. పని పూర్తయిన తరువాత, పని ప్రారంభించకముందే కృతజ్ఞతలు చెబితే ఎలా?" అన్నారాయన నవ్వుతూ.

"అవును సార్ మీరు చెప్పింది నిజమే... ఎప్పుడు ఏ మాట మాట్లాడాలో కూడా తెలియని స్థితిలో ఉన్న నాకు మీరు గురువుగా ఉండబోతున్నారు. నన్ను తీర్చిదిద్దే బాధ్యత మీదే సార్.." అన్నది నీరజ.

"చాలా పెద్ద బాధ్యతే నామీద పెట్టావు. నీ ప్రయత్న లోపం లేకుండా ఉంటే, నా సహకారం నీకు ఎల్లప్పుడూ ఉంటుంది" అన్నాడు మార్కండేయులు అదోలా నవ్వుతూ.

"మరి నన్ను ఎప్పటి నుంచి రమ్మంటారు సార్..?" అని అడిగింది నీరజ.

"రేపటి నుంచి రా, రేపు మంచిరోజు, తిథీ, వారం, నక్షత్రం అన్నీ బావున్నాయి..."

"ఇదే సమయానికి రమ్మంటారా?" అని అడిగింది నీరజ.

"ఇక్కడ కుదరదమ్మా, యూనివర్శిటీలో ఉన్నంతసేపూ క్షణం తీరిక ఉండదు. సాయంత్రం పూట ఎవరో ఒకరు వచ్చి సాహిత్య సభలూ, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలూ అంటూ సభల్లో పాల్గొనేందుకు లాక్కుపోతుంటారు...." అని ఆగిపోయాడేగానీ ఆమెను ఎప్పుడు రమ్మనేది చెప్పలేదు.

"అవును సార్, జంట నగరాల్లో ఏ సభ జరిగినా మీరు లేనిదే అది రాణించదు. అనర్గళమైన వాక్ప్రవాహంతో సభికులను మీరు మంత్రముగ్ధుల్ని చేయటం నేను చాలాసార్లు చూశాను..." అన్నది నీరజ మెచ్చుకోలుగా.

"అదే ఆలోచిస్తున్నాను. నిన్ను ఎప్పుడు రమ్మనాలా.. అని" ఆగిపోయాడు మార్కండేయులు.

"పోనీ ఉదయంపూట వస్తాను సార్..."

"ఉదయంపూట అస్సలు తీరిక ఉండదు.."

"రాత్రి ఎనిమిదింటికి రమ్మంటారా? "

"ఎనిమిదింటికి మరో అమ్మాయి వస్తుంది కనుక నువ్వు తొమ్మిది గంటలకు రా" అని చెప్పాడు మార్కండేయులు.

ఆయన దగ్గర సెలవు తీసుకుని వస్తూ నీరజ దీర్ఘాలోచనలో పడింది.

రాత్రి తొమ్మిది గంటలకు ఆయన ఇంటికి వెళ్తే కనీసం ఒక గంటసేపు అక్కడున్నా పది గంటలదాకా ఉండాల్సి వస్తుంది. రాత్రి పది గంటలకు అక్కడ బయల్దేరి ఇంటికి రావడం ఎంత కష్టం?

నీరజ భర్త భార్గవ, ఈ సమస్యను ఇట్టే తేల్చేశాడు.

"నీకు డాక్టరేట్ రావాలంటే ఊరికే రాదు. కష్టపడాలి. కష్టపడి చదవటం, విషయసేకరణ చేయటం, రాయటం, తిరిగి రాయటం, ఈ శ్రమకు తోడు అనుభవజ్ఞులైన ఆయన ఆశీస్సులు అండదండలూ కూడా నీకు అవసరమే.. అందుచేత నేను నిన్ను రోజూ స్కూటర్ మీద తీసుకెళ్ళి, తీసుకొస్తాను, సరేనా? " అన్నాడు భార్గవ.

ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు, నెలల తరబడి, సంవత్సరాల తరబడి భర్తను కష్టపెట్టటం ఆమెకు ఇష్టం లేకపోయినా, తప్పలేదు.

"నేను ఆయన ఇంటిదాకా రాను, ఆ వీధి మొదట్లో ఉన్న హోటలు ముందు వెయిట్ చేస్తుంటాను. ఇంక రోజూ ఇదే నేననుకో నీ కోసం ఎదురుచూసే చోటు" అని చెప్పాడు.

నీరజ ప్రొఫెసర్‌గారింటికి వెళ్ళేటప్పటికి ఆయన భోంచేసి మేడమీద గదిలో కూర్చున్నారు. నీరజను అక్కడికే రమ్మన్నారు. కాసేపు లోకాభిరామాయణం మాట్లాడాక ఆయన అసలు విషయంలోకి వచ్చారు.

"నీవు 'శ్రీకృష్ణుడి ప్రేమ తత్వం' గురించి కదా థీసీస్ రాస్తున్నావు. అసలు నీకీ సబ్జెక్ట్ మీద ఆసక్తి ఎందుకు కలిగింది?" అని అడిగారాయన.

"శ్రీకృష్ణుడు భగవంతుడి అవతారమని అంటారు. భగవంతుడు మామూలు మనిషిగా జన్మిస్తే ఆయన జీవన విధానం ఎలా ఉండాలి? మానవాళికి ఆదర్శప్రాయమైన జీవితం గడపాలిగదా. కానీ ఆయన దేవతలకే దేవుడై యుండి, ఏ నియమ నిబంధనలనూ పాటించలేదు. ఎనిమిదిమంది భార్యలున్నారు. వివాహం చేసుకోకపోయినా, అందరికన్నా మిన్నగా ఆరాధించే రాధ ఉంది. కృష్ణుడు రాధతో 'నేనే నీవు, నీవే నేను' అంటాడు. వీళ్ళు కాక పదహారువేల మంది గోపికలకు ఆయన ప్రేమ పాత్రుడు. యమునానదీ తీరంలో తమాలవృక్షం కింద నిలబడి ఆయన అధరాల నుంచీ అనంతవాహినిగా ప్రవహించే వేణుగానానికి పరవశమైన గోపికలు తన్మయత్వంతో నృత్యం చేస్తుంటే, ఆయన నారీ నారీ నడుమ మురారీ అయినాడు. ఆయన ప్రేమ తత్వం గురించి ఎంతైనా చెప్పవచ్చు.." అని ఆవేశంగా చెప్పిన నీరజ అలుపు తీర్చుకోవటానికి ఆగింది.

"బావుంది, నీ ఆలోచనా ధోరణి బావుంది. అయితే ఆయన ప్రేమ తత్వానికి నువ్వు చెప్పే నిర్వచనం ఏమైనా ఉందా?" అని అడిగాడు మార్కండేయులు.

"ఈ విషయంలో నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి. కానీ అవి ఇంకా అస్పష్టంగానే ఉన్నాయి..." అన్నది నీరజ.

"రోజూ వచ్చి కాసేపు చర్చించు. నీ సందేహాలూ, అనుమానాలూ తీరిపోతాయి..." అన్నాడాయన.

రోజూ నీరజ ఆయన ఇంటికి వస్తోంది.

ఆమె వచ్చే వేళకు ఆయన తీరికగా కూర్చుంటున్నారు. ఆమె ఎన్నుకున్న సబ్జెక్ట్ అలాంటిది కావటం వల్ల వాళ్ల సంభాషణ ఎప్పుడూ ప్రేమ గురించే జరుగుతుండేది.

నీరజ పగలంతా కష్టపడి అనేక పుస్తకాలు చదివి కృష్ణభగవానుడి వ్యక్తిత్వం గురించి, తత్వం గురించి, తెల్సుకునేందుకు ప్రయత్నించింది. వాటి గురించిన తన విశ్లేషణలను కాగితాల మీద పెట్టింది. అవన్నీ మార్కండేయులుకు చూపించాలని తీసుకెళ్ళేది. 'చూస్తాను' అంటూనే కాలక్షేపం చేస్తున్నాడు.

ఈ మధ్య ఆయన మరింత చొరవ తీసుకుంటున్నాడు. "నువ్వు బాగా పైకి వస్తావు" అంటూ నీరజ భుజం మీద చెయ్యి వేస్తున్నాడు.

గురువుగారు, వయస్సులో పెద్దవారు, తండ్రిలాంటి వారు భుజం మీద చెయ్యివేసి అభినందిస్తే తప్పులేదని సరిపెట్టుకుంటున్నా ఆయన తరచుగా ఏదో వంకతో ఆమెను తాకటం, కొంటెగా మాట్లాడటం, చిలిపిగా చూడటం ఎక్కువవుతోంది.

తల్లీ తండ్రీ గురువు – వీరంతా దేవుడితో సమానమని పెద్దలు చెప్పారు. కానీ మన సమాజంలో తారసపడుతున్న వాళ్లంతా ఎలాంటివాళ్ళు?

రాధికా స్వాంతనం చదవమని ఇచ్చాడు మార్కండేయులు. అది ఇదివరకే చదివానని చెప్పింది నీరజ.

"దానిమీద నీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగారు.

కృష్ణ భగవానుడి సాన్నిధ్యం కోసం ప్రతి స్త్రీ హృదయమూ, అంతగా తపించిపోతుందని చెప్పింది నీరజ.

"నీ హృదయం కూడానా? " అని మళ్ళీ అదోలా నవ్వాడు.

నీరజ తలదించుకుంది. ఆయన అందులోని కొన్ని పేరాలు చదవమన్నాడు. ఆమె మనసులోనే, కళ్లతోనే చదువుకుంటోంది.

"పైకి చదువు – వింటాను. నా జన్మ ధన్యమవుతుంది" అన్నాడు మార్కండేయులు.

నీరజ చదువుతున్నంతసేపూ, కామోద్వేగంతో చూస్తూ ఆమె చెయ్యి పట్టుకున్నాడు. దగ్గరకు లాక్కోబోయాడు.

"ఏమిటి సర్ ఇది? మీరు పెద్దవారు, నాకు గురుదేవులు, తండ్రిలాంటివారు..." అన్నది నీరజ భయంతో కంపించిపోతూ.

"కృష్ణుడి ప్రేమతత్వం ఏం వంటబట్టించుకున్నావు మరి? ఆయన ద్రేపల్లెలో స్వర్గాన్ని తలపింపచేసే సమాజాన్ని ఏర్పాటు చేయాలనుకున్నాడు. అక్కడ వాళ్ళకు ఈర్ష్యలు లేవు. అసూయలు లేవు. వావివరసలూ లేవు.." అన్నాడు మార్కండేయులు.

"కానీ మన సమాజం వేరు. మనం అమృతం తాగిన దేవతలము కాదు, నెత్తురు తాగే రాక్షసులమూ కాదు. వావివరుసలు మరచి చెట్ల కొమ్మలు పట్టుకొని వేళ్ళాడే వానరులమూ కాదు. ఆవకాయ అన్నం తినే నరులం... ఇవన్నీ మీకు చెప్పదగ్గదాన్ని కాదు.." అన్నది నీరజ దయనీయంగా వేడుకొంటూ.

"ఆవకాయ అన్నం తినేవాళ్ళం కాబట్టే మనకిన్ని కోరికలు..." అంటూ ఆమెను మీదకు లాక్కునే ప్రయత్నాన్ని వదల్లేదు.

నీరజ ఆయన కబంధహస్తాల్లోనుంచి విడిపించుకుంది. తన పుస్తకాలను తీసుకుంది. వెనక్కి తిరిగి చూడకుండా మెట్ల మీద నుంచి గబగబా పరుగులాంటి నడకతో వెళ్తోంది. మనసు అంతా అల్లకల్లోలంగా ఉంది.

ఆయనకు తన వయస్సులో ఉన్న కూతుళ్ళు ఉన్నారు, కోడళ్లు ఉన్నారు... తనకు పెళ్ళి అయింది. ఆయన దేవుడులాంటివాడు. తను జీవితంలో ఇంకా ఏదో సాధించాలని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశిస్తూ తనను తీసుకొచ్చి ఇక్కడ వదిలిపెడుతున్నారు. కానీ తను అక్కడకు వెళ్ళి ఏం చేస్తోంది? ఆయనతో ప్రేమ కలాపాల కోసమా... ఈ చదువు...

మార్కండేయులు తనమీదకు లాక్కోబోయిన ఆ సంఘటన ఆమెను పీడకలలాగా వెంటాడుతోంది. భర్తను చూడగానే దు:ఖం ఆపుకోలేకపోయింది.

"ఏమైంది నీరజా?" అని అడిగాడు భార్గవ.

"ఏం లేదండీ, నా కోసం మీరు రోజూ ఇలా ఎదురుచూస్తూ రోడ్డుమీద ఎంత సేపు కాపలా ఉంటారు? తల్చుకుంటేనే బాధగా ఉంది.." అన్నది నీరజ ఉద్వేగాన్ని ఆపుకుంటూ.

"నా కోసం బాధపడుతున్నావా, భలేదానివేలే, రేపు నువ్వు డాక్టర్‌వైతే నాకే కదా గొప్ప... నీకా ఆసక్తి ఉంది. తపన ఉంది. ఆరాటం ఉంది. అవకాశం ఉన్నపుడు కష్టపడి చదువుకోవాలన్న ధ్యాస ఉన్నప్పుడు, నేను అడ్డుపడి నీ ఆశల్ని, ఆశయాలను తుంచెయ్యకూడదు నీరజా. నా వల్ల నువు నీ భవిష్యత్తు పాడుచేసుకున్నావన్న ఫీలింగ్ నీకు ఎప్పుడూ కలగకూడదు..." అని తన మనసులోని మాట చెప్పాడు అతను.

"మీ ఆలోచనలూ, అభిప్రాయాలూ నాకు క్షుణ్ణంగా తెల్సు..." అని స్వగతంలో అనుకోబోయి పైకి అనేసింది.

మార్కండేయులుతో ఘర్షణపడి బయటకు వచ్చిన తరువాత, ఏం చేయాలో అర్థం కావటం లేదు. ఆయన ఇంటికి వెళ్ళటం నాలుగు రోజులు మానేసింది. భర్తతో చెప్పటమా, మానటమా అన్న సందిగ్ధంలో పడింది. చివరకు చూచాయగా తెలియజేసింది.

"ఆయన వ్యవహారం నాకు నచ్చటంలేదండీ, బాగా పైకి వస్తావమ్మా అంటూ భుజం మీద చెయ్యి వేశారు.. నేను పరాయి స్త్రీని. మరొక వ్యక్తి భార్యను... ఈ విషయమైనా ఆయన గుర్తుంచుకోవద్దూ..." అని చెప్పింది.

"ఒకవేళ నిన్ను నిజంగానే అభినందించటానికి అలా చెయ్యివేసి ఉండవచ్చు. తండ్రీ, గురువూ.... దైవంతో సమానం అన్నారు. అనవసరంగా నువు రంగుటద్దాల్లో నుంచి చూసి అపోహపడుతున్నావేమో నీరజా..." అన్నాడు భార్గవ.

రంగుటద్దాలు... నిజమే మంచివాళ్ళకు లోకం అంతా మంచిగానూ, పరమ పవిత్రంగానూ కనిపిస్తుంది.

సరే మరి, ఇప్పుడింక ఏం చేయాలి? అంత కష్టపడి శ్రమపడి చేసిన ప్రయత్నమంతా మట్టిపాలేనా? కావాలంటే గైడ్‌ను మార్చుకోవచ్చు... కానీ ఈ గురువుగారిని చూశాక, మగజాతిమీదనే నమ్మకం పోతోంది.

తను ఇంతకాలం రాసినవన్నీ ఆయన దగ్గరే ఉన్నాయి. అందుకని ఫోన్‌చేసింది.

"నేను అనారోగ్యం వల్ల కొద్ది రోజుల నుంచీ రాలేకపోయాను. రమ్మంటారా?" అని అడిగింది.

"నిన్ను రావద్దని అనలేదే, నువ్వే మానుకున్నావు" అని ఫోన్ పెట్టేశాడు.

ఆ తరువాత వెళ్లినా ఆయన ఇదివరకటిలా మాట్లాడేవాడు కాదు. చాలాసేపు ఆయన కిందనే ఉండేవాడు. తను ఒక్కతే కూర్చుని కూర్చుని విసుగు పుట్టి వెళ్ళిపోయేది. ఆ పేపర్స్ ఇవ్వమంటే ఇదుగో అదుగో అంటున్నాడు.

చివరకు ఒకరోజు అడిగింది ఏం చేయమంటారని. ఆయన స్పష్టంగా చెప్పాడు. "నువ్వు నా కోరిక తీరిస్తే నేను నీ కోరిక తీరుస్తాను... ఎవరికి దేని మీద ఉంటుందో ఆ ప్రేమను పొందటం కోసం ప్రయత్నించటంలో తప్పులేదు. అదే అసలైన భగవానుడి ప్రేమ తత్వం..".

"మీరు గురువులుగా భావించి, మిమ్మల్ని మహోన్నతమైన వ్యక్తిగా ఊహించి, మీ దగ్గర శిష్యరికం చేయాలని వచ్చాను. మీ దగ్గరకు వచ్చానుకదాని కాటెయ్యబోయారు. మీ తుచ్ఛమైన కోరిక తీర్చుకునేందుకు ఏవో పెద్ద పెద్ద మాటలు చెబుతున్నారు. మన సాంప్రదాయాలను గౌరవించలేని

సంస్కారం సంస్కారమే కాదు. అలాంటి సంస్కారహీనుడిని గురువుగా చెప్పుకునే దౌర్భాగ్య స్థితి నాకు కలగకూడదు.... గుడ్ బై..."అని చెప్పేసి బయటకు నడిచింది నీరజ.

రెండు నెలల తరువాత ఆయన గుండెపోటుతో చనిపోయాడన్న విషాద వార్త పేపర్లో చదివింది. అది నీరజకు సంతోష వార్త అయింది. ఆయన ఇంటికి వెళ్ళి ఆ పేపర్లు తెచ్చుకుంది.

మార్కండేయులు చనిపోయినందువల్ల ఆమెకు కొత్త గైడ్ దొరికాడు. ఆయనకు తను రాసినవన్నీ చూపించింది. అవన్నీ చదివి 'చాలా బాగా రాశావమ్మా' అంటూ అభినందించాడు. భుజం మీద చెయ్యి వేస్తాడేమోనని భయపడి ఒక్క అడుగు వెనక్కి వేసింది.

కానీ ఆయన దగ్గర వెనకడుగు వేయాల్సిన అవసరం లేకపోయింది.

ఆమెకు ఈసారి నిజమైన గైడ్, ఫిలాసఫర్, గురువూ, దైవమూ లభించాడు.

------

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.